నిలిచిన 'సమీకృతం'..!



2021లో పనులు ప్రారంభించినట్లు శిలాఫలకం

- అందుబాటులోకి రాని ఇంటిగ్రేటెడ్ మార్కెట్
- రెండేళ్లు గడిచినా నగం పనులు కాని వైనం


భైంసాలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

భైంసాటౌన్: గత ప్రభుత్వం పట్టణ ప్రగతిలో భాగంగా మున్సిపాలిటీల్లో సమీకృత మార్కెట్లు మంజూరు చేసింది. వెజ్, నాన్‌వెజ్, పూలు, పండ్లు వంటి అన్ని మార్కెట్లు ఒకే ప్రాంగణంలో ఉండేలా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఇందులో భాగంగా భైంసా పట్టణంలో మార్కెట్ నిర్మాణానికి పట్టణ ప్రగతి, టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.7.20 కోట్లతో మార్కెట్ మంజూరు చేసింది. స్థానిక మిర్చి మార్కెట్‌యార్డు స్థలంలో 33 గుంటల స్థలం కేటాయించగా, 2021 ఆగస్టులో అప్పటి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హాజరై శిలాఫలకం ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ సంస్థ పనులు టెండర్ ద్వారా దక్కించుకోగా, ఏడాదిలోపు పనులు పూర్తి చేయాలని అగ్రిమెంట్ ఉంది. కానీ, దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఇప్పటికి 50 శాతం పనులు కూడా పూర్తికాలేదు. ప్రస్తుతం ఎక్కడి పనులు అక్కడే నిలిచినట్లు తెలుస్తోంది. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనుల్లో జాప్యమేర్పడుతోందని విమర్శలున్నాయి.

రోడ్ల పక్కనే చిరువ్యాపారాలు

సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తయితే ఒకే ప్రాంగణంలో కూరగాయలు, చికెన్, మటన్, చేపల విక్రయ దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. అలాగే పూలు, పండ్లు, ఇతర చిరు దుకాణాలు సైతం ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం కూరగాయల వ్యాపారులు బస్టాండ్, మార్కెట్ ఏరియా, గంజ్, మున్సిపల్ కార్యాలయ ప్రాంతాల్లో రోడ్ల పక్కనే కూరగాయలు, పండ్లు, పూల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో వాటి కొనుగోలు కోసం వస్తున్న వినియోగదారులు వాహనాలను రోడ్డుపై నిలిచి ఉంచుతుండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వ్యాపారులు సైతం ఎండకు, వానకు ఇబ్బంది పడుతున్నారు. మాంసం విక్రయ దుకాణాలు సైతం రోడ్ల పక్కన ఉండడంతో రోడ్లపై దుమ్ము వాటిపైనే పడుతోంది. సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తయితే కొనుగోలుదారులకు వెజ్, నాన్‌వెజ్‌తోపాటు పండ్లు, పూలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి రానున్నాయి. రోడ్ల పక్కన చిరువ్యాపారాలతో ఏర్పడే రద్దీని నియంత్రించవచ్చు.

పనులు వేగవంతం చేస్తాం

సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు 50 శాతం వరకు పూర్తి కావచ్చాయి. మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తాం. వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించాం.
– హరిభువన్‌గౌడ్, ఏఈ(పీహెచ్), నిర్మల్

క్లుప్తంగా

డీఎంసీ సుభాష్‌పై చర్య తీసుకోవాలి


మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

నిర్మల్‌టౌన్: మెప్మా డీఎంసీ సుభాష్‌పై చర్య తీసుకోవాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుభాష్‌పై అవినీతి ఆరోపణలు గతంలో అధికారుల దృష్టికి వచ్చిన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సిటీ లీవ్లీ ఫుడ్ సెంటర్ (సీఎల్‌సీ)కు మంజూరైన సుమారు రూ.40 లక్షల నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. అతనిపై విచారణ జరిపించి, శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్లు మేడారం అపర్ణ–ప్రదీప్, సైండ్ల ఉమారాణి–శ్రీధర్, కత్తి నరేందర్, గంగ్రత్ రమణ, సాయన్న పాల్గొన్నారు.

అక్షరాస్యత వారోత్సవాలు విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 29 వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు విజయవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈనెల 26 నుంచి 29 వరకు జరిగే వారోత్సవాల సందర్భంగా పొదుపు చేయడం అలవాటు చేసుకోండి, ఆర్థిక లాభాలను ఆర్జించండి, సైబర్ స్మార్ట్ అవ్వండి అనే వాల్ పోస్టర్లను సోమవారం బ్యాంకు, జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆలయ ఉద్యోగికి పదోన్నతి


పదోన్నతి పత్రం ఇస్తున్న ఈవో

భైంసా: బాసర ఆలయ ఉద్యోగి దేవుని శివరాజుకు సోమవారం సూపరింటెండెంట్‌గా పదోన్నతి లభించింది. ఈవో విజయరామారావు ఉద్యోగికి పదోన్నతి పొందిన పత్రాన్ని ఇచ్చారు. పదోన్నతి రావడం పట్ల తోటి ఉద్యోగులు అభినందించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


లోకేశ్వరంలో నంబర్లు వేస్తున్న డీవో హరిప్రసాద్

లోకేశ్వరం: ఇంటర్ పరీక్షల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీవో కదార్ల హరిప్రసాద్, చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ విద్యార్థుల నంబర్లను వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నమన్నారు. జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 108 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 97 మంది హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల కేంద్రం ఇన్‌చార్జి మహేందర్ ఉన్నారు.

ఎస్సైగా బాధ్యతలు స్వీకరణ



కుంటాల: కుంటాల ఎస్సైగా వి. రజనీకాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతుగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన ఆయన్ను పలువురు అభినందించారు.

కేంద్రం ఇచ్చిన హామీలు అమలు చేయాలి


నోరు మూసుకుని నిరసన తెలుపుతున్న రైతు సంఘ, సీఐటీయూ నాయకులు

భైంసాటౌన్: కేంద్రప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నోరు మూసుకుని నిరసన తెలిపారు. కనీస మద్దతు ధర చట్టం కోసం ఢిల్లీలో చేపట్టిన రైతుల ఉద్యమంపై కేంద్రం టియర్‌గ్యాస్ ప్రయోగించి యువరైతుని బలిగొందని ఆరోపించారు. దీనికి నిరసనగా నిరసన తెలిపినట్లు పేర్కొన్నారు. చనిపోయిన రైతు కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం అందించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఇప్ప లక్ష్మణ్, చందుల సాయికిరణ్, సాజిద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్

కుంటాల: కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్ పేర్కొన్నారు. కుంటాలలో రూ.15 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. మాజీ పీఏసీఎస్ చైర్మన్ జుట్టు లక్ష్మణ్, మాజీ సర్పంచ్ జుట్టు మహేందర్, పోశెట్టి, జుట్టు దయాకర్, జుట్టు నరేందర్, బోగ లక్ష్మణ్, గజేందర్, జుట్టు చరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ.7 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ ప్రారంభించారు. నాయకులు ఈటెల శ్రీనివాస్, అట్ల రాంరెడ్డి అట్ల చిన్నరామిరెడ్డి, రవి, భాస్కర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

సోన్‌లో..

సోన్: మండలం కడ్తాల్, కూచన్‌పెల్లి గ్రామాల్లో సోమవారం సీసీ, డ్రెయినేజీ నిర్మాణ పనులను ఎంపీడీవో సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు గ్రామాల్లో మొత్తం రూ.10 లక్షల ఉపాధి హామీ నిధులతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఎంపీటీసీ రాజేశ్వర్, నాయకులు హరీష్‌రెడ్డి, గంగయ్య, సాయినాథ్, కార్యదర్శి సుజిత్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

- జిల్లా జడ్జి కర్ణకుమార్


పోలీస్ అధికారులతో సమావేశమైన జిల్లా జడ్జి కర్ణ కుమార్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌టౌన్: కేసుల పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలని జిల్లా జడ్జి కర్ణకుమార్ సూచించారు. కేసుల సత్వర పరిష్కారంపై జిల్లా కోర్టు సమావేశ మందిరంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి పోలీసులతో సోమవారం సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులు, 2020కి ముందు కేసుల పురోగతి, గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, తదుపరి చర్యలపై చర్చించారు. కోర్టు భవనాలు, నిర్మల్‌లో న్యాయాధికారులకు నివాస గృహాల నిర్మాణానికి అంచనాల ప్రతిపాదనలు, బాసరలో జ్యూడీషియల్ గెస్ట్‌హౌస్ నిర్మాణ పనుల తదితర అంశాలపై చర్చించారు. అనంతరం జిల్లా జడ్జి మాట్లాడుతూ జిల్లాలో నేరాల అదుపునకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కేసులు పరిష్కారం కాని సందర్భంలో లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించేలా చూడాలని తెలిపారు. చట్టాల ఆవశ్యకతను వివరించాలన్నారు. జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ కోర్టుల్లో రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందులో క్రిమినల్, సివిల్, భూతగాదాలు, రోడ్డు ప్రమాదం, వివాహ, కుటుంబ తగాదాలు, డ్రంకెన్‌డ్రైవ్ కేసులు సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాలు


కుంటాల:పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు, దంపతులు

కుంటాల: పెంబికల్‌పాడ్ గ్రామంలో సోమవారం శ్రీశ్రీశ్రీ శివ పంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం మహిళలు మంగళహారతులతో భాజాభజంత్రీలతో విగ్రహాలను ఊరేగించారు. శ్రీశ్రీశ్రీ సంజయ్ శర్మ ఆధ్వర్యంలో మహాగణపతి పూజ తదితర చేపట్టారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.


నిర్మల్‌టౌన్: పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని నాయుడివాడలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం మారెమ్మ, పోచమ్మ తల్లి పోతరాజుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి అలంకరణ, అభిషేకం, హోమం తదితర పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, స్థానిక కౌన్సిలర్ సాదం స్వప్న–అరవింద్, అయ్యన్న గారి భూమయ్య, ముడుసు సత్యనారాయణ పాల్గొన్నారు.


సోన్: పాల్గొన్న భక్తులు

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామంలో శ్రీపెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో కనుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య భక్తులు ఉత్సాహంగా నిర్వహించారు.భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.అంతకుముందు ఆలయంలో చండీ హోమం జరిపారు.అనంతరం అన్నదాన చేశారు. గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ముదిరాజ్ కుల సంఘ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతిపూజ, మహాలింగార్చన

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో గల శ్రీరాజరాజేశ్వరాలయంలో ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో బాగంగా సోమవారం గణపతిపూజతో పాటు మహాలింగార్చనను ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పండితులు నిమ్మగడ్డ సందీప్ శర్మ బృందం ఆధ్వర్యంలో నాగసుబ్రహ్మణ్య విశేషపూజ, స్థాపితా దేవతారాధనలు, హోమాలతో పాటు ఫల, పుష్పాధివాసాలు తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో బయోకెమిస్ట్రి ఎండీగా పనిచేస్తున్న, గ్రామనివాసి డా. సీఎం వేణుగోపాలకృష్ణను ఆలయ కమిటి సభ్యులు శాలువాతో సన్మానించారు.

విద్యార్థులకు అవగాహన

కుంటాల: ప్రకృతిని సంరక్షిస్తేనే మానవాళికి మనుగడ ఉంటుందని, కాపాడితేనే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుందని పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేశ్ పేర్కొన్నారు. మండలంలోని కల్లూర్ కేజీబీవీ,కుంటాలలోని ఉన్నత,ఆదర్శ పాఠశాలల విద్యార్థులకు సోమవారం అంతరించిపోతున్న పక్షి జాతులను ఎలా కాపాడుకోవాలన్న అంశాలపై అవగాహన కల్పించారు.పాఠశాలలకు తనవంతుగా మట్టి పాత్రలు, బర్డ్ ఫీడర్లను ఉచితంగా అందజేశారు. ఎంఈవో ముత్యం, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, ఎస్‌వో సువర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీరు, విద్యుత్ సమస్య పరిష్కారం

ఖానాపూర్: పట్టణంలోని 5వ వార్డు పరిధిలోని కరీంకాలనీతో పాటు ఇంద్రనగర్ ఎస్సీ కాలనీల్లో కౌన్సిలర్ పరిమి లత సురేశ్‌ల ఆధ్వర్యంలో స్వంత డబ్బులతో తాగునీరు విద్యుత్ సమస్యను పరిష్కరించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని నూతన కనెక్షన్లు ఏర్పాటు చేసినట్లు కౌన్సిలర్ తెలిపారు. ఇంద్రనగర్ ఎస్సీ కాలనీలో ఇటీవల వర్షానికి బోరు మోటార్‌కు ఉన్న సర్వీసు వైరు కాలిపోయిందన్నారు. కౌన్సిలర్ నూతన సర్వీసు వైరు తెప్పించి మరమ్మతు చేయించారు. నీరు, విద్యుత్ సమస్యను పరిష్కరించిన కౌన్సిలర్‌ను కాలనీవాసులు అభినందించారు.

మహిళా శిబిర్ ప్రారంభం

తానూరు: మండలంలోని కల్యాణి గ్రామంలో సోమవారం భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో మహిళ శిబిర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన భారతీయ బౌద్ధ మహాసభ సభ్యులు పాల్గొన్నారు. కేంద్రీయ శిక్షక కవిశతాయి బుద్ధుని చరిత్ర వివరించారు. రమేశ్‌బాబు వాగ్మారే ఉన్నారు.

రేపే వైస్ ఎంపీపీ ఎన్నిక

సోన్: వైస్ ఎంపీపీ కొత్తగొల్ల నరేశ్ మృతితో ఈ పదవి ఖాళీ ఏర్పడడంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 28 బుధవారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికకు జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ నర్సింహారెడ్డి ఎన్నికల ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు.

చైర్మన్ రేస్‌లో ఇద్దరు ?



కుంటాలలోని పీఏసీఎస్ భవనం

- నేడు బలనిరూపణ

కుంటాల: కుంటాల పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాంపై ఇటీవల పలువురు పాలకవర్గ సభ్యులు అవిశ్వాసం పెడుతూ డీసీవోకు తీర్మాణ ప్రతిని అందజేసిన విషయం తెలిసిందే.

నేడు బలనిరూపణ!

చైర్మన్‌పై సొంత పార్టీ డైరెక్టర్లు అవిశ్వాస ప్రకటించడంతో రాజకీయంగా చర్చనీయంగా మారింది. 8 డైరెక్టర్లు ఫిబ్రవరి 5న అవిశ్వాస ప్రతిని డీసీవోకు అందజేయడంతో ఈనెల 27న బలనిరూపణకు హాజరుకావాలని ఫిబ్రవరి 7న 13 మంది డైరెక్టర్లకు నోటీసులు అందజేశారు. దీంతో ఒక వర్గం వారు క్యాంప్‌నకు తరలివెళ్లారు.

చైర్మన్ రేస్‌లో ఇద్దరు డైరెక్టర్లు

కుంటాల పీఏసీఎస్ పరిధిలో 13 మంది డైరెక్టర్లు ఉన్నారు. 2020లో సహకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. కాగా, మరో ఏడాదిన్నర మాత్రమే చైర్మన్ పదవీకాలం ఉన్న.. ముధోల్ ఎమ్మెల్యేగా పవార్ రామారావు పటేల్ గెలుపొందగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కుంటాల సొసైటీ బీఆర్ఎస్ డైరెక్టర్లే చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడం కుంటాల రాజకీయాలను మలుపు తిప్పింది. చైర్మన్ సట్ల గజ్జారామ్‌కు ఆయనతో కలిపి నలుగురు డైరెక్టర్లు మద్దతుగా ఉన్నట్లు, అవిశ్వాసం పెట్టిన వారికి మెజార్టీ వర్గం డైరెక్టర్లు ఉన్నట్లు సమాచారం. విఠాపూర్ డైరెక్టర్ గోనె గజ్జారాం, నర్సాపూర్(జి) మండలంలోని తురాటికి చెందిన తూర్పాటి వెంకటేశ్ చైర్మన్ రేస్‌లో ఉన్నట్లు తెలిసింది. అవిశ్వాసం పెట్టిన డైరెక్టర్లు నేరుగా క్యాంపు నుంచి నేరుగా మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే బలనిరూపణకు హాజరుకానున్నట్లు విశ్వసనీయ సమాచారం. డైరెక్టర్లంతా ఒకే తాటిపై ఉండాలని ఇటీవల మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చర్చలు జరిపినా విఫలమయ్యాయి. ఒకే పార్టీకి చెందిన డైరెక్టర్లు కుర్చీ కోసం పోటీ పడుతున్నారు. నేడు నిర్వహించే బలనిరూపణలో చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో వేచిచూడాల్సిందే.

దేగాంలో బీరప్ప కల్యాణం


పూజలు చేస్తున్న కురుమ సంఘం సభ్యులు

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో సోమవారం బీరప్ప కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో కురుమ సంఘం సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వం రైతులకు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విలాస్ అన్నారు. రాష్ట్రవ్యాప్త ధర్నాలో భాగంగా కలెక్టరేట్‌లో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు కనీసం మద్దతు ధర చెల్లించాలన్నారు. నాయకులు ఎల్ఆర్ ఉపాలి, ఎస్ఎన్ రెడ్డి, రమేశ్, జాదవ్ శంకర్, దుర్గే అనంత రావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పిన్ అందుకున్న క్లబ్ అధ్యక్షుడు

ఖానాపూర్:ఖానాపూర్ లయన్స్ క్లబ్‌కు భవన నిర్మాణ కోసం స్థలాన్ని దానం చేసినందుకుగాను క్లబ్ అధ్యక్షుడు సాదుల వెంకటస్వామి అంతర్జాతీయ పిన్ అందుకున్నారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ హిల్ పాటిల్ ద్వారా అందజేసిన అంతర్జాతీయ పిన్‌ను సోమవారం జిల్లా కేంద్రంలో లయన్స్ క్లబ్ గవర్నర్ లక్ష్మి అందజేశారు. అమరనాథ్‌రావు, ప్రవీణ్, నవీద్, నర్సయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

'డబుల్ బెడ్రూం'లో అనర్హులను తొలగించాలి

ఖానాపూర్: పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో ప్రభుత్వం కేటాయించిన 400 డబుల్ బెడ్రూం ఇళ్లల్లో అధికంగా అనర్హులు ఉన్నారని ఈ మేరకు బాధిత పేదలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ అశిస్‌సంగ్వాన్‌ను సోమవారం కలిసి విన్నవించారు. ఇళ్లు పొందిన వారిలో ఎంతో మంది స్థానికేతరులతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, భూములు, ఇళ్లు ఉన్నవారు ఉన్నారని పేర్కొన్నారు. ఇళ్లు కేటాయించిన వారి నుంచి సెల్ఫ్ అఫిడవిట్‌ను తీసుకుని అనర్హులను తొలగించాలని కోరారు. అనర్హులను తొలగించాలని హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) వేశామని, కోర్టు ఇచ్చే ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బొప్పారపు శ్రీనివాస్, ఎండీ గౌస్, వరలక్ష్మి, సమ్రిన్, రత్నమాల, అఫ్సర్‌బేగం, తదితరులు ఉన్నారు.


కలెక్టరేట్ వద్ద ఉన్న బాధితులు

డీఎంహెచ్‌వోపై ఫిర్యాదు

గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పంపిణీచేసే న్యూట్రిషన్ కిట్ల పంపిణీలో నిర్లక్ష్యంపై ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు పీటర్, సురేందర్ మాట్లాడారు. సమగ్ర విచారణచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఎల్లమ్మకు బోనాలు


బోనాలతో వస్తున్న గౌడ సంఘం మహిళలు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామంలోని శ్రీ రేణుక మాత ఆలయ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. గౌడ సంఘం సభ్యులు తమ ఇళ్ల వద్ద తయారు చేసిన బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు అమ్మవారి కల్యాణం నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేసినట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.